క్లుప్తంగా

ఎస్ఎంసీ వైస్ చైర్మన్ వైఎస్సార్‌సీపీలో చేరిక



కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: గోనెగండ్ల మండల పరిధిలోని వేముగోడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ వైస్ చైర్మన్ బి.బాలరాజుతో పాటు మరికొందరు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో పార్టీలో చేరిన ఆయనతో పాటు మరికొందరికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

గోనెగండ్ల : ఎవరైన అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు హెచ్చరించారు. బుధవారం గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. మండలంలో క్రైమ్ రేటును, ఏ గ్రామంలో నేరాలు అధికంగా జరుగుతున్నాయి, అందుకు గల కారణాలను సీఐ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని గ్రామంలో పికెట్ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. మండలంలో ఎక్కడైన మట్కా, జూదం, అక్రమ మద్యం అమ్మకాలు ఉంటే ఉక్కుపాదం మోపాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు శ్రీరాములు, బ్రహ్మయ్య, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



పారిశుద్ధ్య కార్మికులకు హోమియో మందులు అందజేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో లిటిల్ ఫ్లాక్ ఫౌండర్ జీబీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 180 మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి, కమిషనర్ గంగిరెడ్డి, ఇంటర్నేషనల్ హోమియో క్లినిక్ అధినేత డాక్టర్‌అరుణ్ కుందవరంలు హోమియో మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత



నామినికి చెక్కును అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: సహకార సంఘం నుంచి మంజూరైన రూ.రెండు లక్షల బీమా చెక్కును బాధిత కుటుంబానికి అందజేసినట్లు పర్సనల్ ఇన్‌చార్జి రామరాజు తెలిపారు. కౌతాళం సహకార పరపతి సంఘంలో సభ్యుడిగా ఉన్న రైతు రఘురామ ఈనెల 3న పాము కాటుతో మృతి చెందాడు. అతనికి సంఘంలో జనతా యాక్సిడెంట్ పాలసీ ఉండడంతో బుధవారం నామిని అయిన భార్య అనితకు బీమా మొత్తం రూ.2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడికంబాలిలో పారిశుద్ధ్య పనులు

కౌతాళం: మండల పరిధిలోని గుడికంబాలి గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తామని సర్పంచ్ సిద్ధేశ్ తెలిపారు. గ్రామంలో ఈనెల 24, 25వ తేదీల్లో మారెమ్మదేవర జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని డ్రైనేజీల్లో పేరుకుని పోయిన మట్టిని, చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను చేసినట్లు వెల్లడించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఆదోని అర్బన్: పట్టణంలోని కమేళా కాలనీ వద్ద వన్‌టౌన్ పోలీసులు బుధవారం 39 సంచుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫిరోజ్‌బేగం అనే మహిళ ఆటోలో 39 సంచుల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా కమేళా కాలనీ వద్ద దాడి చేసుకున్నట్లు చెప్పారు. నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: రైతాంగ సమస్యలపై 13వ తేదిన జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని రాంపురం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై నిరసన గళం విప్పుతూ, అన్నదాలకు అండగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ వద్ద జరిగే కార్యక్రమానికి రైతులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో కోసిగి మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ

- దగా చేస్తున్న కూటమి సర్కారుపై నిరసనగళం
- 13న కర్నూలు కలెక్టరేట్ వద్ద ఆందోళన
- భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పిలుపు



పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పార్టీ నాయకులు

ఆదోని టౌన్: రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వంపై నిరసనగళం వినిపిద్దాం, అన్నదాతలకు అండగా నిలుద్దాం.. అని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పిలుపునిచ్చారు. అన్నదాతలను దగా చేస్తున్న కూటమి సర్కారుపై ఈనెల 13వ తేదీన భారీ ఎత్తున రైతులతో ప్రదర్శనలతో పాటు కలెక్టరేట్ ముందు ఆందోళన చేపడతామని తెలిపారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్‌సిక్స్ హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించాలని, దళారీ వ్యవస్థను నిర్మూలించాలని, తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మంచిపద్ధతి కాదని, అలాంటి విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఉచిత పంటలబీమాను పునఃరుద్ధరించాలన్నారు. ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వం ఏమి చేసిందో రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని, కూటమి ప్రభుత్వ తీరు అసంతృప్తికి గురి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేయకుండా అబద్ధాలతో కాలయాపన చేస్తూ రైతులను నట్టేట మోసగిస్తోందన్నారు. ఇది సహించరానిదన్నారు.

బడ్జెట్‌లో సూపర్‌సిక్స్‌కు కేటాయింపులేవీ?

రైతు భరోసా, అమ్మ ఒడి, విద్యాదీవెన తదితర పథకాలకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడం, బడ్జెట్‌లో సూపర్‌సిక్స్ పథకాలకు నిధులు కేటాయించకపోవడం ఏమిటని ఎమ్మెల్సీ డా.మధుసూదన్ ప్రశ్నించారు. దగా పడుతున్న రైతులకు నష్టపరిహారం, గిట్టుబాటు ధరలు కల్పించడంలోనూ కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని విమర్శలు చేశారు. 18 ఏళ్ల పైబడిన మహిళలకు లకు రూ.1500 చెల్లిస్తామని, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి, రైతులకు రైతు భరోసా ఇవ్వకుండా కల్లిబుల్లి మాటలతో కాలయాపన చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు అబ్దుల్‌గౌస్, నరింహులు, కౌన్సిలర్‌లు రామలింగేశ్వరయాదవ్, బాషా, ఫయాజ్‌అహ్మద్, మహ్మద్‌స్వామి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ బాషా, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు మురళీరెడ్డి, నల్లారెడ్డి, నవీన్, శీను, ఎంపీటీసీ ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.

రైతులను ముంచిన కూటమి ప్రభుత్వం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బుట్టారేణుక, రుద్రగౌడ్, పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక
- అన్నదాతకు అండగా 13న చలో కలెక్టరేట్
- పోస్టర్ల ఆవిష్కరణ

ఎమ్మిగనూరుటౌన్: పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ఆరునెలలైనా ఇచ్చిన హామీ అమలుచేయకుండా అన్నదాతను కూటమి ప్రభుత్వం ముంచిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. కూటమి సర్కార్ విధానాలకు నిరసనగా, అన్నదాతకు అండగా నిలబడేందుకు వైఎస్సార్‌సీపీ ఈనెల 13న జిల్లా కలెక్టరేట్ ముందు చేపట్టనున్న ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయ ఆవరణలో పార్టీ నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. అంతకుమునుపు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20వేలు ఇస్తామని చెప్పి ఖరీఫ్ సీజన్ ముగిసినా దాని ఊసేలేదన్నారు. అదే మాజీ సీఎం జగనన్న హయాంలో వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా క్రమం తప్పకుండా రూ.13,500ల రైతులకు అందించి ఆదుకున్నారని గుర్తు చేశారు. 53.52లక్షల మంది రైతులకు రూ.32,288కోట్ల రైతు భరోసా అందించడం జరిగిందని తెలిపారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయని కూటమి ప్రభుత్వం ఏఓ సాకులు చెప్పి తప్పించుకుందన్నారు. గత ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసిందని, ఉచిత పంటల బీమా అమలు చేసి రైతులను ఆదుకుందని చెప్పారు. నిరసన కార్యక్రమానికి రైతులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవలింగాయత్ విభాగం అధ్యక్షుడు రుద్రగౌడ్, పార్టీ నాయకుడు బుట్టా శివనీలకంఠ, మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఎంపీపీ కేశన్న, గోనెగండ్ల మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివప్పగౌడ్, సునీల్‌కుమార్, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, విరుపాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

నందవరం : ప్రజా సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ రమణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమకు అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో వివిధ సమస్యలపై 53 అర్జీలు అందించారని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ మహేష్, ఆర్ఐ జెర్మియా, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

ఎమ్మిగనూరురూరల్: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలోని సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించి 40 రోజుల్లో పరిష్కారం చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ చిరంజీవి, మండల ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్, తహసీల్దార్ శేషఫణి, సబ్ రిజిస్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్లలో రెవెన్యూ సదస్సు

గోనెగండ్ల : రెవెన్యూ గ్రామ సభలలో భూసమస్యలు పరిష్కరం అవుతాయని తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో దాదాపు 100 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ శిరీష, ఆర్ఐ జనార్దన్ రావు, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పోషకాహార కిట్ల పంపిణీ



పోషకాహార కిట్లు పంపిణీ చేసిన వైద్యాధికారులు

ఆదోని సెంట్రల్: క్షయ వ్యాధి గ్రస్తులకు పోషకాహార కిట్లను బుధవారం డాక్టర్ షేకున్ బాను, డా.బాల మురళీ కృష్ణ, డా.వాణిశ్రీ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిరంజన్ కుమార్ క్షయ వ్యాధి గ్రస్తులు పది మందిని దత్తత తీసుకొని ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువ చేసే సరకులను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. పోషకాహారాలను ఆరు నెలలు పాటు అందించడానికి ముందుకు వచ్చిన సదరు ఉపాధ్యాయుడిని అభినందించారు. అలాగే ఆసుపత్రిలో క్షయ వ్యాధి గ్రస్తులు కూర్చోవడానికి రూ.10వేలు విలువ రెండు బెంచీలు, టిబుల్‌ను అందించారని చెప్పారు. ఈయనను ఆదర్శంగా తీసుకొని అదే పురపాలక ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఫయాజ్ బాషా కూడా వచ్చే నెల నుంచి క్షయ వ్యాధి గ్రస్తులు 10 మందికి పోషకాహార కిట్లను పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. దాతలు ఎవరైన స్పందించి ముందుకు రావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ బాబురాజు ఉపాధ్యాయులు ఫయాజ్ బాషా, వెంకటేష్, ముకుంద, ఎంపీహెచ్ఎస్ లలితమ్మ, టీబీ సెంటర్ సిబ్బంది స్వరూప్ రాజకుమార్, మౌనిక, భాస్కర్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లను నిర్మించాలి

ఆదోని టౌన్: పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీలో మరుగుదొడ్లను నిర్మించాలని ఆ వార్డు కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ కోరారు. బుధవారం కాలనీ మహిళలతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కలిసి సమస్యను విన్నవించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలోని మరుగుదొడ్లు కూలిపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌తో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేశారు. ఆ యూనియన్ అధ్యక్షుడు పీరా, సోమన్న, రామంజి, అల్తాఫ్, వీరేష్, రాఘవేంద్ర, కర్రెప్పతో పాటు మరికొంత మంది మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ కృష్ణకు వినతి పత్రాన్ని సమర్పించారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి, గ్రామస్తులు

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి భూమిపూజ చేపట్టారు. బుధవారం గ్రామంలో గ్రామ సర్పంచ్ వడ్డే ఉలిగయ్య, మాజీ సర్పంచ్ ఆకాష్ రెడ్డిల ఆధ్వర్యంలో మండల గ్రాంటు కేటాయించిన నిధులతో పనులను ప్రారంభించారు. గ్రామంలో చాల కాలంగా పెండింగ్‌లో ఉన్న 320 మీటర్ల రోడ్డు పనులను ప్రారంభించడంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు, మండల గ్రాంటు కేటాయించిన ఎంపీపీ ఈరన్న కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు బసిరెడ్డి, ఎంపీటీసీ ప్రహ్లాద, టీకే బీమన్న, బారికి హనుమప్ప, వడ్డే వీరేష్, కర్రెప్ప, నాగేంద్ర, భీమా , వడ్డే విశ్వనాథ్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించకుంటే తమ ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేంద్ర, నారాయణ, శివరామకృష్ణ, నరసప్ప తెలిపారు. తమ సమస్యల సాధన కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన రిలేదీక్షలు బుధవారానికి ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్మికుల దీక్షకు ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి హనీఫ్, భారత రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి ఏసేబు, చేనేత సంఘ నాయకుడు నీలకంఠ తదితరులు సంఘీభావం తెలిపారు.

టమాటకు గిట్టుబాటు ధర కల్పించాలి



పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఏఐకెఎంఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: రైతులు పండించిన టమాటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని నందమూరి తారకరామరావు కూరగాయల మార్కెట్‌ను ఆ సంఘం నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టించి పండించిన టమాట పంటకు గిట్టుబాటు ధర లేక, వాటిని పారబోసే దుస్థితి నెలకొందన్నారు. పట్టణంలో రైతు బజార్‌ను ఏర్పాటు చేసి రైతులే నేరుగా ప్రజలకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని, కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు, బాబు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

ఆదోని రూరల్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ బండారి హనుమంతు మాదిగ, బండారి గిడ్డయ్య మాదిగ జి.ఎస్.దత్తు మాదిగ ఆధ్వర్యంలో బుధవారం గోనబావి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుదర్శన్, ఉపాధ్యక్షుడిగా అక్బర్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, కార్యదర్శిగా రాజన్న, సహాయ కార్యదర్శి ఇసాక్, కార్యదర్శులు బాలరాజు, రాజు, ఇశ్రాయేలు, సందీప్‌లను ఎన్నుకున్నారు.

ఎమ్మిగనూరు వాసిపై చీటింగ్ కేసు నమోదు

ఆదోని అర్బన్: తమ కంపెనీలో పెట్టుబడి పెడితే డబ్బులు రెండింతలు చేసి ఇస్తానని నమ్మించి మోసం చేసిన ఎమ్మిగనూరు వాసి రాఘవేంద్రపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు తెలిపిన మేరకు వివరాలు.. పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీకి చెందిన గర్జప్ప అనే వ్యక్తితో హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఎమ్మిగనూరు వాసి రాఘవేంద్ర తమ కంపెనీలో డబ్బు పెడితే రెండింతలు అవుతుందని నమ్మించాడు. దీంతో గర్జప్ప ఏడున్నర లక్షల రూపాయలు కంపెనీలో పెట్టాడు. మెచ్యూరిటీ తర్వాత అడిగితే ఇదిగో అదిగో అంటూ చెబుతున్నాడని, దీంతో మోసపోయానని తెలుసుకున్న గర్జప్ప టూటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాఘవేంద్రపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

వైభవంగా భగవద్గీత జయంతి



భగవద్గీత శ్లోక పోటీల్లో గెలుపొందిన విద్యార్థికి బహుమతులు అందజేస్తున్న స్వామీజీ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని గీతామందిరంలో శ్రీభగవద్గీత జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. బుధవారం మందిరంలో కొలువుతీరిన శ్రీ కృష్ణుడుకి శ్రీనివాసాచార్ స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, ఫలపుష్పాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. సోయత్రి బ్రహ్మనిష్ట అవ్యక్తనంద సరస్వతి స్వామి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో భగవద్గీతలో శ్రీ కృష్ణుడి బోధనలను భక్తులకు వినిపించారు. ప్రతి ఒక్కరూ సనాతన ధర్మం పాటించి సన్మార్గంలో నడవాలని, అప్పుడే మానసిన ప్రశాంత కలుగుతుందన్నారు. మండల కేంద్రంలోని వివిధ పాఠశాలలో నిర్వహించిన భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి, కుమార్ దొర, శ్యాంప్రసాద్, కృష్ణమూర్తి, అడివప్ప, సిద్ధారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఎరిగేర వెంకోబ, కొల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో గీతాజయంతి

మంత్రాలయం: మండల కేంద్రంలోని పాతవూరు ఆంజనేయ్యస్వామి గుడి వద్ద ఆర్ఎస్ఎస్ మంత్రాలయం శాఖ సభ్యులు రాఘవేంద్ర, శివ, కృష్ణ ఆధ్వర్యంలో గీతాజయంతి వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో భాగంగా భగవద్గీతలోని పలు అంశాల పై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

రేపటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు

గోనెగండ్ల : మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయంలో భద్రకాళి దేవి, వినాయకస్వామి, నందీశ్వరస్వామి, విగ్రహ ఆలయ గోపుర కళశ, ప్రతిష్ఠాపన కార్యక్రమం ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి, సురేష్ బాబు తెలిపారు. ప్రతిష్ఠోత్సవాలు షాపూర్ జగద్గురు గిరి మల్లేశ్వర వివాచార్య మహా స్వామి వారిచే నిర్వహించబడుతాయన్నారు. అలాగే గోనెగండ్లలోని సూర్య వంకలో గత వినాయక దేవాలయంలో కలశ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



స్వామి దర్శనానికి వెళ్తున్న అసిస్టెంట్ కమిషనర్ ఆర్.హనుమంతరావు

మంత్రాలయం: జిల్లాలో మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆర్.హనుమంతరావు హెచ్చరించారు. బుధవారం గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అబౌడీ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైన్‌షాపుల్లో ఎమ్మార్పీల కంటే ఎక్కువకు విక్రయిస్తే వెంటనే తమ ఫోన్ నెంబర్:9440902268కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించి ఏపీ, కర్ణాటక మద్యంను విక్రయిస్తే తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. ముఖ్యంగా మంత్రాలయం శ్రీమఠం పరిసరాల్లో మద్యం విక్రయిస్తే పీడీయాక్ట్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జయరామునాయుడు తదితరులు ఉన్నారు.



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఘనంగా మారెమ్మ దేవర

కోసిగి: మండల పరిధిలోని కడదొడ్డి గ్రామంలో గ్రామ దేవతలు మారెమ్మ, దేవమ్మల దేవర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం వేకువ జామున నుంచి ఆలయంలో అమ్మవారిని కొలువుంచి నూతన వస్త్రాలతో, వెండికవచం, ఫల పుష్పాలంకరణలు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రతి ఇంటి నుంచి పూర్ణకుంభాలలో నైవేద్యం తయారు చేసి డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం చెంతకు చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉత్సవాలకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు. పూజల్లో కందుకూరు, కడదొడ్డి, తుంబిగనూరు, గౌడుగల్లు గ్రామ నాయకులు తాయన్న, ఉసేని, ఈరన్న, మహాదేవా, ఎంపీటీసీ మల్లయ్య, చంద్రన్న స్వామి, ఆర్లబండ రమేష్, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి



బైకు ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, హిందూ సంఘాల సభ్యులు

ఆదోని అర్బన్: విజయవాడలో వచ్చే నెల 5వ తేదీన జరిగే హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం పట్టణంలోని ప్రధాన రహదారిలో విశ్వ హిందూ పరిషత్, వివిధ హిందూ సంఘాల సభ్యులు బైకు ర్యాలీ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైకు ర్యాలీ స్థానిక ఫారెస్ట్ లైన్ అంబాభవానీ దేవాలయం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయం వరకు సాగింది. ముందుగా అంబా భవానీ మాతకు విశ్వహిందూ పరిషత్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీ ప్రారంభించారు. హిందూ పరిషత్ సభ్యుడు విట్టా రమేష్, హైందవ సంఘం ఆయా హిందూ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.